


పారిజాతానికి పెళ్లయిన మొదటిరోజునించే ఎప్పుడు నీళ్లోసుకొంటానా అని ఆరాటపడసాగింది.

మూడేళ్లయింది.

పారిజాతానికి మొగుడు బాబూరాజేంద్రప్రసాదు నీళ్లు పోయలేకపోయాడు.

పక్కపేటలోనే వుండే పారిజాతం తల్లి అనంతలక్ష్మీబాయి రోజా రిక్షా కట్టించుకుని కూతురింటికి వస్తుంది. తన బిడ్డ నీళ్ళోసుకుందన్నవార్త వినాలన్న ఆరాటంతో రోజూ అదో కార్యక్రమం అయిపోయిందామెకి.



# ఆటలో అరటిపండు

"ఏం బిడ్డా! ఈ వేళ కూడా వీళ్లాడ లేదా?" అడిగింది అనంతలక్ష్మీబాయి.

"అసలు నీళ్లుంటే కదా! పోసుకోడానికి', అసహనంగా అంది పారిజాతం.

"డాక్టరమ్మకి చూపెట్టుకోవా ల!" అంది అనంతలక్ష్మీబాయి.

తల్లి సలహా ప్రకారం డాక్టరక్కమ్మ దగ్గరకి వెళ్లింది పారిజాతం.

డా.పూరక్కమ్మ పారిజాతాన్ని బోలెడు ప్రశ్నలు అడిగింది.

పిగ్గు సిగ్గుగా సమాధానం చెప్పింది పారిజాతం.

కొన్ని మందులు రాసిచ్చింది డాక్టరక్కమ్మ.

"ఈ మందులు వాడితే కడుపొస్తుందా?" ఆశగా అడిగింది పారిజాతం.

"ఏమిటే మరీ చిలిపిప్రశ్న. ఈ మందులు నేను వాడితే కదా నాకు తెలీడానికి. నీ ప్రశ్నకి నాకే సిగ్గేస్తుంది. పిచ్చిపిల్లా! మీరిద్దరూ ఈ మందులు వాడడంతోపాటు మీ భార్యాభర్తల ప్రయత్నం కూడా ఉండాలి. కార్యక్రమం రోజూ ఉంటే మంచిది" సలహా ఇచ్చింది డా.అక్కమ్మ.

దారిలో రిక్షా ఆపి మందులు కొనుక్కుంది పారిజాతం గంపెడు ఆశతో.

బాబూ రాజేంద్రప్రసాద్ మూడు పూటలూ మందులు వేసుకుంటున్నాడు. కూతురు, అల్లుడు మందులు వాడ్డం మొదలుపెట్టాక అనంతలక్ష్మీబాయి ఊపిరి పీల్చుకొంది. 'ఇక పని జరిగినట్టే!' అని సంతోషించింది. కూతురికిపుట్టబోయే బాబుకి 'బోసుబాబు' అని పేరుపెట్టాలని ఆమె నిశ్చయించుకుంది.

ఆర్నెల్లయినా పారిజాతం నీళ్లోసుకోలేదు. అనంతలక్ష్మీబాయి బుగ్గలు నొక్కుకుంది.

"ఏమిటో ఈ విడ్డూరం నాకు తెలీడం లేదు బిడ్డా! మా కాలంలో చెయ్యట్టుకొంటే కడుపుపండేది! ఈ దిక్కుమాలిన వాడెక్కడ దొరికాడే నీకు!" అని శోకండాలు పెట్టింది. తర్వాత బరబర ముక్కుచీదేసి పవిటకొంగుకు తుడుచుకొని అంది.

"అనుకునేం లాభమే బిడ్డా! నీ మొగుడు అసలే బక్కపీచు సన్యాసి. కాస్త మేపి చూడు."

"ఎట్ట మేపాలే?"

"పొద్దున్నే రెండు ఉడకేసిన గుడ్లు ఓ పెద్ద గలాసుడు పాలు... ఆఫీసుకెళ్లేటప్పుడు కమ్మని

భోజనం, మధ్యాహ్నం ఆఫీసులో తినడానికి చపాతీలు, ఆమ్లెట్లు పెట్టు. ఇంటికొచ్చాక రెండు సున్నుండలు పెట్టు.''

''అప్పుడన్నా పని జరుగుతూందంటావే?'' బేలగా అడిగింది పారిజాతం.

''జరగాలి బిడ్డా! జరగలేదనుకో ఇట్టాటి సన్యాసి మొగుణ్ని జాతరకట్టుకెళ్లి తెగేసిపారేయాలా!'' అనంతలక్ష్మీబాయి కోపంగా అంది. మంగళసూత్రాన్ని కళ్లకి హత్తుకొని ''అంత మాట ఎందుకులేవే'' అంది పారిజాతం.

ఆ తర్వాత మూడు నెళ్ళపాటు తరిపి గేదెని ఇంట్లో కట్టేసి మేపినట్టు బాబూరాజేంద్రప్రసాదుని మేపింది. కమ్మగా తినడానికలవాటుపడి తిని మంచానికి అడ్డంగాపడి నిద్రపోడం మొదలెట్టాడు బాబూరాజేంద్రప్రసాద్.

మందులు ఫలించక, మేపిన తిండికి డబ్బు దండగ కాగా ఇక గుడులు గోపురాలు చుట్టూ తిరగడం మొదలుపెట్టింది.

తను తిరగడం దొర్లడమే కాకుండా తనతో సమానంగా భర్త బాబూరాజేంద్రప్రసాద్‌ని కూడా దొర్లించింది. మొగుడి చేత సెలవు పెట్టించి తీర్థయాత్రలు చేసి వచ్చింది.

ఏడేళ్లు గడిచిపోయినయి. బాబూరాజేంద్రప్రసాద్ మాత్రం చీకూ చింతా లేకుండా తినడం, ఆఫీసుకు పోవడం, వచ్చి తినడం, మంచానికి అడ్డంగాపడి నిద్రపోవడం పారిజాతానికి చాలాకోపం వస్తుంది.

నీళ్లోసుకోవాలని పారిజాతం, మనవణ్ని ఎత్తుకోవాలని అనంతలక్ష్మీబాయి తహతహ మరింత పెచ్చురేగింది.

ఏ తాయత్తో కట్టిస్తే తప్ప పారిజాతానికి కడుపురాదని నిశ్చయించుకుందామె తల్లి.

ఆమె నేస్తం తలుపులమ్మ అనుకోకుండా కలిసి చెప్పింది.

''ఈ మాత్రం దానికి ఎందుకే బాధపడతావు. స్వామి ధీరేంద్ర అని పసుమర్రులో ఉంటారు. ఆయన్ని దర్శిస్తే నీ కూతురు కడుపుపంటమీద పంట పండుతుందే!'' అంది.

''నీ మాట నిజం అయితే నీకో పట్టుకోక పెట్టకపోనులే గానీ అంత ఖచ్చితం ఏమిటి తలుపులూ!'' అడిగింది అ.ల.బాయి.

''నా కోడలికి అయిదేళ్లు పిల్లలు పుట్టలా! స్వామీజీ మహిమతో కవలలు పుట్టారే!'' అంది తలుపులమ్మ.

అల్లుడు ఆఫీసుకి పోంగానే పారిజాతాన్ని వెంటపెట్టుకుని పసుమర్రు తీసుకెళ్లింది. స్వామీజీకి విషయం చెప్పుకుంది అ.ల.బాయి.

స్వామీజీ పారిజాతాన్ని చూసి చిరునవ్వు నవ్వాడు.

''పూజ సామాగ్రి తెచ్చారా!'' శిష్యుడు అడిగాడు.

'ఆహా..... తెచ్చాం బాబు!'

స్వామీజీ లేచి నించున్నారు.

'నీ కోరిక నెరవేరడానికి ఏకాంతపూజ చేయాలి. లోపలకి నడువమ్మా!'' అన్నాడు స్వామీజీ.

''క్షేమంగా వెళ్లి లాభంగా తిరిగి రా బిడ్డా! భయపడకు. స్వామీజీ మంచిగా పూజచేస్తారు. వెళ్ళు బిడ్డా!'' దీవించింది అనంతలక్ష్మీబాయి. లోపలికి నడిచింది పారిజాతం.

స్వామీజీ చిరునవ్వునవ్వి

''పూజసామాగ్రి అక్కడపెట్టి తలుపులు వేసిరామ్మా!'' అన్నాడు.

తలుపులేసి స్వామీజీ దగ్గర కొచ్చింది పారిజాతం.

పారిజాతం తలపైన చేత్తో సవరదీసి ''నీ కోసం, నేను తలపెట్టబోతున్న పూజా కార్యక్రమం చాలా ప్రమాదమైంది. ఇది చాలా గుట్టుగా ఉండాలి. దీన్ని గురించి నువ్వు ఎవ్వరికి చెప్పినా ఫలితం ఉండదు. మీదుమిక్కిలి నువ్వు గొడ్రాలిగా మిగిలిపోతావు'' అన్నారు హెచ్చరికగా.

''చెప్పను స్వామీ!'' అంది.

''అయితే పూజ ప్రారంభిస్తాను; నీ వంటిపైన వస్త్రాలని తొలగించు''.

''సిగ్గు వేస్తుంది స్వామీ!''

''అందబోయే ఫలితాన్ని చేజార్చుకోకు పారిజాతమా! కళ్ళు మూసుకో''

''మధ్యలో తెరిస్తే....!''అంది.

''అయితే గంతలు కట్టుకో! అని ఆమె కళ్లకి గంతలు కట్టాడు.

''నేను మాయని సృష్టిస్తున్నాను. ఆ మాయలో నువ్వు... సుఖాన్ని పొందుతావు. దాని ఫలితంగా నీ వాంఛ నెరవేరుతుంది''.

''అలాగే స్వామీ!'' అంటూ పారిజాతం ఒంటిమీద వస్త్రాలని ఒలిచేసుకుంది. స్వామీ ధీరేంద్ర ఆమెని మెల్లగా ఆ గదిలో ఉన్న మంచం దగ్గరకి నడిపించుకెళ్లాడు.

అరగంట తర్వాత ఆమె కళ్లకి కట్టిన గంతలు విప్పి

''ఈ అనుభవం ఎలా ఉంది?'' అడిగాడు స్వామీజీ.

''మీరు సృష్టించిన మాయాజీవితంలో ఇంత సుఖం పొందవచ్చని నాకిప్పుడే తెలిసింది. మళ్లీ ఒకసారి గంతలు కట్టండి స్వామీ!'' అంది.

స్వామీజీ ఉలిక్కిపడ్డారు.

''వెంటవెంటనే మాయని సృష్టించలేను పారిజాతం. తపోశక్తి రోజుకి మూడు నాలుగుసార్లు మాత్రమే సిద్ధిస్తుంది. ఈ రోజు వరప్రాప్తి పొందిన మూడో స్త్రీవి నువ్వు. కళ్లకి గంతలు కట్టించుకోవాలనే ఆసక్తి నీకు మెండుగావుంటే కనీసం ఓ గంట కాలం వేచివుండక తప్పదు'' అన్నాడు.

''గంటకాదు స్వామీ! మీ అనుగ్రహం కోసం నేను రోజూ రమ్మన్నా వస్తాను'' అంది.

స్వామీజీ చిరునవ్వు నవ్వారు.

పారిజాతానికి నెల తప్పింది. జరిగిందేమిటో పారిజాతానికి తెలుసు. బాబూరాజేంద్రప్రసాదు 'ఆటలో అరిటిపండు' అని ఆమెకి ఎప్పుడో తెలుసు. కానీ సగటుస్త్రీగా తనూ చేయగలిగిన ప్రయత్నాలు చేసింది. బిడ్డల కోసం బరితెగించి ఎవర్నో నమ్ముకొనే సాహసం ఆమెకి లేకపోబట్టే ఇన్నాళ్లూ బాబూరాజేంద్రప్రసాద్‌కి నమ్మినభార్యగానే ఉంది. ఆఖరికి అనంతలక్ష్మీబాయికి అల్లుడి పస తెలిసిపోయాక తలుపులమ్మ సలహా మేరకి చొరవ తీసుకుని కూతుర్ని స్వామీజీ దగ్గరకి తీసుకెళ్లింది ఆమె.

స్వామీజీ అనే ముసుగులో ఉన్న ధీరేంద్ర రసకందయానం గురించి అనంతలక్ష్మీబాయికి తలుపులమ్మ చెప్పనే చెప్పింది. గుట్టుగా పని జరగాలి అనే పారిజాతాన్ని తన వెంట తీసుకెళ్లింది అనంతలక్ష్మీబాయి.

జీవితంలో అంత చక్కని చిక్కని అనుభవాన్ని తొలిసారిగా రుచి చూసిన ఆ క్షణంలోనే బాబూరాజేంద్రప్రసాద్ అంటే ఒక విధమైన రోతపుట్టుకొచ్చింది.

అనంతలక్ష్మీబాయి స్వామీజీ దయని కొనియాడుతోంది.

బాబూ రాజేంద్రప్రసాద్ మాత్రం అదంతా తన వీరోచిత కార్యంగా భావించి ఇంటి ముందు చిచ్చుబుడ్లు కాలుస్తున్నాడు. ○

మధుసోంబాబు